www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 3 డిసెంబర్ 2024
5
అన్నమయ్య



కరాటేలో సత్తాచాటిన 'యోధా' విద్యార్థులు


కరాటే ఛాంపియన్స్ విజేతలతో మాస్టర్

ప్రజాశక్తి-పీలేరు: అంతర్ జిల్లా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పీలేరు యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు తమ సత్తా చాటారు. తిరుపతి జిల్లా, రేణిగుంటలో నేషనల్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ కరాటే ఛాంపియన్‌షిప్ నిర్వహించింది. ఈ సందర్భంగా సోమవారం పీలేరులో యోధా మార్షల్ ఆర్ట్స్ అకా డమీ కరాటే మాస్టర్ ఇనామిల్ హక్ మీడియాకు విజేతల వివరాలు తెలియజేశారు. రేణిగుంటలో జరిగిన అంతర్ జిల్లా కరాటే ఛాంపియన్ షిప్ వ్యక్తిగత కటా ఈవెంట్‌లో తమ అకాడమీ విద్యార్థులు విభిన్న ప్రతిభాపాటవాలను ప్రదర్శించారన్నారు. అండర్-14 విభాగంలో మదిత్ సాయి ప్రథమ స్థానం, అండర్-11 విభాగంలో కౌస్తుభ్ ద్వితీయ స్థానాన్ని, అండర్-15లో విభాగంలో హితేష్ ద్వితీయ స్థానం, అండర్-14 విభాగంలో ఫరూక్ తృతీయ స్థానాన్ని, వికాస్ అనే మరో విద్యార్థి ఫైట్‌లో రెండవ స్థానం, కటా ఈవెంట్ ఓపెన్ కేటగిరీలో 3వ స్థానాన్ని తమ సొంతం చేసుకున్నారని కరాటే మాస్టర్ తెలియజేశారు.

రైతులను ముంచిన ఫెంగల్

- 2,339.25 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- రూ.1.76 కోట్ల పంట నష్టం
- ఆందోళనలో రైతన్నలు
- అప్రమత్తమైన జిల్లా అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

మూడు రోజుల నుంచి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాన్ కారణంగా అన్నమయ్య జిల్లాలో ఎడ తెరపలేని వర్షం కురిసింది. శని వారం ఉదయం నుండి సోమవారం సాయంత్రం వరకు జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల వల్ల అన్నమయ్య జిల్లాలో వరి, మొక్కజొన్న, అరటి, టమోటా, చామంతి పూల తోటలు, బీన్స్ తదితర చేతికొచ్చిన పంటలన్నీ తడిసి ముద్దయ్యాయి. రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రబీ సాధారణ సాగు భూమి 2.50925 ఎకరాలకు గాను 25,060 ఎకరాల్లో సాగుచేశారు.

వ్యవసాయ పరంగా చూస్తే..: వర్షాల కారణంగా జిల్లాలో 2233.5 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో మొక్క జొన్న నష్టపోయారు. మొత్తం 76 గ్రామాలలో 2176 మంది రైతులు, రూ.1.54 కోట్లు పంటలు నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గుర్రంకొండ మండలంలో వరి 30 ఎకరాలు, మదనపల్లె 810, నిమ్మనపల్లి 662.5, కురబలకోట 162.5, రామసముద్రం 80 ఎకరాలు, బి.కొత్తకోట వరి 375 ,మొక్క జొన్న 50 ఎకరాలు , రామాపురం 55, చిన్నమండెం 56, పీలేరు 1.5, రాయచోటి 1 ఎకరాల్లో వరి నష్టం జరిగింది.

ఉద్యాన శాఖలో.. జిల్లా వ్యాప్తంగా 55.75 ఎకరాలకు 26 మంది రైతులు నష్టంతో రూ.22.30 లక్షల నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.10 గ్రామాలలో రైతులు రైతులు 26 మంది రైతులు, చామంతి, బీన్స్, టమోటా, అరటి, పంటలు నష్టపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో మదనపల్లెలో చామంతి 2.00, బీన్స్ 6.60, టమోటా 2.00, నిమ్మనపల్లి టమోటా 1.60, పెనగలూరు బీన్స్ 0.40, రైల్వే కోడూరు బీన్స్ 1.20 హెక్టార్లలో నష్టపోయారని అధికారులు అంచనా వేశారు.

ప్రజల అప్రమత్తంగా ఉండాలి

అన్నమయ్య జిల్లా ఫెంగల్ తుపాను ప్రభావం ఉండడంతో ప్రజల అప్ర మంతంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పిఎస్ పేర్కొన్నారు.


రైల్వేకోడూరు మండలం ఉర్లగడ్డపోడులో నేలకొరిగిన అరటి పంట

రాజంపేట, రైల్వే కోడూరు, మదనపల్లి తదితర ప్రాంతాలలో ఫెంగల్ తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్త ఉండాలని సూచించారు.

662.5 ఎకరాలలో నేలకొరిగిన వరి

నిమ్మనపల్లె: మూడు రోజులుగా కురుస్తున్న తుపాన్ దాటికి నేల వాలిన, నీట మునిగిన వరి పంటను క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి నివేదికలను సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపించినట్లు మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తెలిపారు. మండలంలో సాగుచేసిన ప్రధాన పంట ఆయిన వరి ప్రస్తుతం కోత దశలో ఉందని, పూర్తిస్థాయిలో వరి పంట కోతలు పూర్తి కాలేదన్నారు. ఫెంగల్ తుఫాను దాటికి గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి వరి పంట నేల వాలి, నీట మునిగిందని తెలిపారు. ఈ క్రమంలో పది పంచాయతీల పరిధిలోని రైతు సేవ కేంద్రం వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా పర్యటించి, వరి పంటను పరిశీలించి సోమవారం వరకు 662.5 ఎకరాలలో లోని వరి పంట నేలవాలి నీట మునిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. నివేదికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. పంట నష్టం పై ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


నిమ్మనపల్లెలో నీటమునిగిన టమోటా పంట


మదనపల్లెలో నేలకొరిగిన వరి పంట

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

గత ప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమణలపై రాబోయే రెండు, మూడేళ్లలో శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎంపి డిఒ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా అర్జిదారులు అధిక సంఖ్యలో పాల్గొని మంత్రికి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. గత ప్రభుత్వ పాలకుల అన్యాయం, అక్రమాల వల్ల పేద ప్రజలు ఎంతో నష్టపోయారని వారందరికీ త్వరలో న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని నియోజక వర్గాలలో ఆయా ఎమ్మెల్యేలు ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించి భూ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న సమస్య గత 5 సంవత్సరాలలో పాలకులు చేసిన దౌర్భాగ్యమైన పనులకు లక్షలాది మంది రైతులు భూములు కోల్పోయారన్నారు. జిల్లా పరిధిలోని మదనపల్లెలో జరిగిన సంఘటన ఇప్పటికీ మన కళ్ళ ముందు కనబడుతుందన్నారు. వేలాది ఎకరాల భూమి ఫ్రీహోల్డ్ చేసి తమ అనుచరులకు తమ కుటుంబ సభ్యులకు పార్టీ సభ్యులకు కట్టబెట్టారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎవరైతే నిజమైన రైతులు నష్టపోయారో అలాంటి వారందరికీ న్యాయం చేసేందుకు రెవెన్యూ అంశాలు పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ప్రజాదర్బార్ ముఖ్య ఉద్దేశం గత ప్రభుత్వంలో అన్నదమ్ములకు సంబంధించిన భూములు మూడో వ్యక్తి పైన రాయించుకోవడం జరిగిందని అలాంటి సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు. అప్పట్లో ప్రభుత్వ అధికారులను బెదిరించి ప్రభుత్వ భూమి, పోరంబోకు భూమి, పిఒటి భూమి ఏ ఇతర భూములను కూడా వదలకుండా గతంలో వారు ఆక్రమించుకున్నార న్నారు. నేడు ఏ గ్రామానికి వెళ్లిన భూ సమస్యలపై ప్రజల గోడు వినలేకపోతు న్నానన్నారు. భూములు కోల్పోయి కోర్టులకు వెళ్లనా న్యాయం జరగని వారికి ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా న్యాయం చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతిరోజు ప్రజల నుంచి విన్నపాల స్వీకరిస్తున్నామన్నారు. 90 శాతం రెవెన్యూ సమస్యలు వస్తున్నాయన్నారు. ఏ నాయకుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి భూ సమస్యలు రాలేదని కేవలం గత ముఖ్యమంత్రి పాలనలోనే భూ సమస్యలు అధికంగా వచ్చాయన్నారు. ఇవన్నీ ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా పరిష్కరించి భూ బాధితులకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ రెడ్డయ్య, టిడిపి నాయకులు మదన్‌మోహన్, ఆరీపుల్లా, షఫీ, నాయక్, కాంటాక్ట్ రాజు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

పంటల బీమా చేయించుకోవాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


ఫసల్ బీమా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, భారత్ ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుపరుస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా పంటను బీమా చేయించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రైతులకు సూచించారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో రబీ 2024 – 25 సీజన్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫసల్ బీమా యోజన పథకం నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు రూపొందించారన్నారు. తుపాన్‌లు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల ద్వారా పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారాన్ని చెల్లించడం, ఎంపిక చేసిన పంటలను సాగుచేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులందరూ బీమా పథకంలో చేరడానికి అర్హులు అని పేర్కొన్నారు. రైతులందరూ బీమా పథకాన్ని ఉపయోగించుకొని పంటలను బీమా చేయించి ఆర్థిక రక్షణ పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్ర నాయక్ పాల్గొన్నారు.

స్టికర్లు ఆవిష్కరించిన కలెక్టర్ : సాయుధ దళాల జెండా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్ ఫ్లాగ్‌లు, స్టికర్లను సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి ఎమ్.డి. రజాక్ ఖాన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాయుధ దళాల త్యాగాలు, సేవలను గుర్తించేందుకు జెండా దినోత్సవం ఒక ప్రత్యేకమైన అవకాశం అని పేర్కొన్నారు. మాజీ సైనికులు, వీరనారులు, వారి కుటుంబాల సంక్షేమానికి మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



విజ్ఞాన మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిఇఒ సుబ్రమణ్యం

విజ్ఞాన మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించబోయే కలామ్స్ విజన్-2024 సైంటిఫికల్ ప్రాజెక్ట్‌ఎక్స్‌పోను జిల్లాలోని హైస్కూల్ విద్యార్థులు ద్వినియోగం చేసుకోవాలని డిఇఒ సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రతిభ కళాశాలలో ఆర్గనైజర్, ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రయివేటు హై స్కూల్ విద్యార్థులు విజ్ఞాన మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఈ సైంటిఫిక్ ఎక్స్‌పో కార్యక్రమానికి ప్రభుత్వ విద్యాశాఖ నుంచి పూర్తిస్థాయి సహకారం ఉంటుందని తెలియజేశారు. ప్రతిభ కళాశాల చైర్మన్ శివ గంగిరెడ్డి మాట్లాడుతూ పిల్లలలోని సృజనాత్మకతను వెలికి తీసి వారి నైపుణ్యాన్ని ప్రదర్శించేటట్లు కలాం సీజన్ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 27 , 28 వ తేదీలలో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు రిజిస్టర్ చేసుకోవడానికి 6281453550, 9391932752లలో సంప్రదించాలన్నారు. సంబంధించి రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ అవార్డు, సర్టిఫికెట్ ఇస్తారన్నారు. మేళా శ్రీ సందీప్ హైస్కూల్‌లో నిర్వహిస్తామన్నారు. ప్రతిభా కళాశాల చైర్మన్ శివ గంగిరెడ్డి, శ్రీ సందీప్ హై స్కూల్ హెడ్ మాస్టర్ వెంకట్ రాంరెడ్డి , ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు పనిభారం తగదు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : అంగన్వాడీలకు వయోజన విద్య ద్వారా మరింత పని భారం వేసేందుకు జిల్లా అధికారులు కుట్ర పన్నుతున్నారని సోమవారం అంగన్వాడీ జిల్లా కార్యదర్శి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు వయోజన విద్య అంగన్వాడీ కు సంబంధం లేకుండా కూడా అదనపు భారం వేస్తున్నారని అన్నారు. రోజూ ఉదయం 6 గంటల నుండి 8 వరకు వయోజన విద్య చదువు చెప్పాలని కోరడం సరైన పద్ధతి కాదన్నారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రతి నెలా ఒకటో తేదీనే గౌరవవేతనం అందించక పోయినా మరింత పని చేయడం ఏంటని ప్రశ్నించారు. అనేక సమస్యలతో అంగన్వాడీలు సతమతమవుతుంటే అదనపు పనిభారం మోపడం ఏంటన్నారు.

బిసి సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షులుగా పద్మ

ప్రజాశక్తి- రాయచోటి



ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం దివిటి పద్మను మహిళా అధ్యక్షులుగా నియ మిస్తూ ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లాకా వెంగళరావు యాదవ్ నియామక ఉత్తర్వులు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్నేళ్లుగా బిసి సంక్షేమ సంఘం పటిష్టానికి రాష్ట్ర స్థాయిలోను, జిల్లా స్థాయిలోను పలు కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. బిసి సంఘ నిర్మాణాన్ని మరింత పటిష్టపరచి విస్తృత పరిచేందుకు బిసి సంఘీయుల మధ్య మరింత ఐక్యతను ప్రోదిచేసి సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు బిసి సంఘం నాయకులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

స్కౌట్‌తో క్రమశిక్షణ, సేవాభావం : డిఇఒ

ప్రజాశక్తి -రాయచోటి

ప్రతి ఒక్కరిలో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవ పెంపొందడానికి స్కౌట్ శిక్షణ తోడ్పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం అన్నారు. పట్టణంలోని గాలివీడు రోడ్డులో అర్చన కళాశాలలో సోమవారం నుండి స్కౌట్ మాస్టర్‌లకు, గైడ్ కెప్టెన్లకు బేసిక్‌తో పాటు అడ్వాన్స్‌లో ఏడు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిఇఒ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ మాస్టర్లు, కెప్టెన్లు అందరూ సేవాభావం కలిగి క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అకాడమిక్ కేలెండర్ ప్రకారం వారంలో ఒక రోజు స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఒక పీరియడ్ కేటాయించారన్నారు. స్కౌటిజంతో చిన్ననాటి నుంచే విద్యార్థులలో సేవాభావం అలవడుతుందన్నారు. అనంతరం అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్ మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులలో నైతిక, మానవతా విలువలు పెంపొందడానికి స్కౌట్ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులు, గురువులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి స్కౌట్స్ శిక్షణ తోడ్పడుతుందన్నారు. అన్నమయ్య జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ బలోపేతం కావడానికి తన వంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, ట్రెజరర్ మార్ల ఓబుల్ రెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, జిల్లాలోని స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ సుబ్రమణ్యం

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి : మంత్రి


మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -రాయచోటి

ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందించే నిత్యావసర సరుకులు ప్రజలకు సక్రమంగా పంపిణీ చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి మండల పరిధిలోని మాధవరం కస్పాలో ఏర్పాటు చేసిన నూతన రేషన్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం నాణ్యమైన సరుకులు పంపిణీ చేస్తున్నారని ంషన్ షాప్ డీలర్లు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో వారికి రేషన్ సరఫరా చేయాలన్నారు. రేషన్ పంపిణీలో ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు తలెత్తినా డీలర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం మాధవరం, మూలపల్లెలో రూ.20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాలవలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. సిసి రోడ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు నాణ్యతతో చేపట్టాలని ఎక్కడైనా నాణ్యత లోపం కనిపించినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రత, అవగాహన కోసం పేరెంట్స్ అసోసియేషన్ పోస్టర్ తీసుకురావడం అభినందనీయమని మంత్రి అన్నారు. సోమవారం ఆయన స్వగ్రామంలో కడప కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థి తల్లిదండ్రుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల సంఘం నాయకులు విద్యార్థుల కోసం ట్రాఫిక్ నియమ నిబంధనలు రూపొందించడం అభినందనీయమనిచెప్పారు. విద్యార్థుల భద్రతపై అవగాహన పెంపొందించుకోవడం కోసం పోస్టర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కేంద్రీయ విద్యాలయం కోసం మరో రెండు అదనపు బస్సులు సమకూర్చాలని కోరడంతో సానుకూలంగా స్పందించిన ఆయన ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి బస్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై మంత్రి సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కడప కేంద్రీయ విద్యాలయ తల్లిదండ్రుల సంఘం ట్రెజరర్ ఎల్ జితేంద్ర, కన్వీనర్ చంద్రగిరి నారాయణ, కో-కన్వీనర్లు వస్త్రాల నర్సింహులు, చింతలపల్లి జయ విశ్వనాథ, ఎ. సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా జిల్లా కాట్వ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-పీలేరు

కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సంఘం ఆమోదంతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సోమవారం కాట్వ రాష్ట్ర కోశాధికారి పోతంశెట్టి రమేష్ తెలిపారు. ఈ ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కమతం సుబ్బారావు హాజరయ్యారు. కాట్వ జిల్లా గౌరవ అధ్యక్షులుగా సంభావు వెంకటరమణ, జిల్లా అధ్యక్షులుగా కె.పరుశురాం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎర్రంశెట్టి వెంకటరమణ, జిల్లా కోశాధికారిగా బ్రహ్మానందం, జిల్లా సహ అధ్యక్షులుగా పి.రమణప్ప, జిల్లా ఉపాధ్యక్షులుగా చీళ్ల రెడ్డప్ప, ఉత్తరాది వెంకటేష్, ఎం.సతీష్, రామకృష్ణ, సి.రాజా రమేష్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎస్.విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శులుగా చింతర్ల రమేష్, నాగినేని మనోహర్, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.శ్రీనివాసులు, బి.ఫణీంద్ర, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా శెట్టి సుబ్రమణ్యం, జిల్లా మహిళా కన్వీనర్‌గా అరుణకుమారి, కో-కన్వీనర్‌గా కె.శిరీష ఎన్నికయ్యారు.



శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డిఐఒ డాక్టర్ ఉషశ్రీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డిఐఒ

ప్రజాశక్తి-పీలేరు

సీజనల్ వ్యాధులను వైద్య శిబిరాల ద్వారా నివారించవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. అధిక వర్షాల్లో ఆరోగ్యసమస్యల నియం త్రణలో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ పరిశీలించారు. సోమవారం ఆమె పిలేరు పట్టణంలోని సైనిక్ నగర్ లో నిర్వహించిన వైద్యశిభిరాన్ని డిఐఓ తనిఖీ చేసి, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా సమీప రోజుల్లో కాన్పు కానున్న గర్భిణులు, నవజాత శిశువులు, వృద్ధులు, మంచానికి పరిమితమైన దీరకాలిక రోగులను, ఓ బృందంగా ఏర్పరచి వారికి ఆరోగ్య మెళకువలు తెలియజేయాలన్నారు. వెచ్చటి వాతావరణం, పరిసరాల పరిశుభ్రత, చాలినన్ని సురక్షిత నీరు, శిశువుకి ఆరు నెలల పాటు తల్లి పాలు, తాజా పౌష్టికాహారం, గురించి ఆరోగ్య బృందం తెలియజేసి, అవసరమైన సేవాలందించాలని చెప్పారు. వర్షాల ఉధృతి తగ్గే వరకు వైద్య శిభిరాలు నిర్వహిస్తూనే ఉండాలని సంభదిత రికార్డ్, రిపోర్ట్ నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి, డాక్టర్ ప్రసన్న, పర్యవేక్షకులు కుసుమ, ఎఎన్ఎం భార్గవి, ప్రమీల కుమారి, సిహెచ్ఓ చంద్రకళ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అడ్డగోలు ఒప్పందాలతో విద్యుత్ ఛార్జీల భారం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మాజీ సిఎం జగన్ మోహన్‌రెడ్డి చేసిన పాపాలు రాష్ట్రానికి శాపాలుగా మారాయని, అడ్డగోలు ఒప్పందాలతో రాష్ట్ర ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడుతోందని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ విమర్శించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ తన మీడియా ద్వారా సిఎం చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నాడని పదేపదే ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. వైసిపి పాలనలో పొరుగు రాష్ట్రంలో ఒక్క యూనిట్ రూ.1.90 లకే దొరుకుతుంటే అదానీ గ్రూపుతో ఒక్కో యూనిట్ రూ.2.49కి చొప్పున 25 సంవత్సరాలకు ఒప్పందం చేసుకోవడం ద్వారా రాష్ట్ర ప్రజలపై పెనుభారం వేశారన్నారు. సిఎం చంద్రబాబు నాయుడుపై అసత్యాలు, గోబెల్స్ ప్రచారం నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా జగన్, వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు.

హామీలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందని, హామీల అమలుకై ఉద్యమబాట పడుతామని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం జరుగనున్న రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో అంగన్వాడీ, ఆశా, మున్సిపల్, వాలంటీర్లు, భవణ నిర్మాణ కార్మికులు, ఆటో వర్కర్లకు ఇచ్చిన ఎన్నికల హామీలపై చర్చించి హామీల అమలుకు కూటమి నాయకులు కృషి చేయాలని కోరారు. సోమవారం స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు పూర్తవుతున్నా ఇంతవరకు అంగన్వాడీ, ఆశా, మున్సిపల్, వాలంటీర్లు, భవన నిర్మాణ రంగం, ఆటో వర్కర్స్ కు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. హామీలను అమలు చేయాలని ఈ నెల 12వ తేదీన అంగన్వాడీలు ఐక్యంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు సిద్ధమయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు దేవా, పట్టణ కార్యదర్శి తిరుమల పాల్గొన్నారు.



జాతీయ రహదారి 716 రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు

గుంతలమయంగా జాతీయ రహదారి

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి రెడ్డిపల్లి దాబా వద్ద రహదారిపై భారీ లోతైన గుంతలు ఏర్పడడం వల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు కింద వందల కోట్లు విడుదల చేశామని చెబుతున్నారే తప్ప గుంతలు అలాగే ఉన్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఈ రహదారిలో ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో రోడ్డుపై ఉండే గుంతలు కనిపించక పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని పేర్కొంటున్నారు. ఎప్పుడు ఏ జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

పాలిటెక్ ఫెస్ట్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-కలికిరి

పాలిటెక్ ఫెస్ట్-2024 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ జి.గణేష్ కుమార్ ఉత్తర్వుల మేరకు కలికిరిలోని కళాశాలలో ఈనెల 5, 6వ తేదీలలో రీజనల్ పాలిటెక్ ఫెస్ట్-2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 20 పాలిటెక్నిక్ ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల నుంచి 334 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. కలికిరిలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి 9,10వ తరగతి విద్యార్థులు హాజరై పాలిటెక్ ఫెస్ట్ ను విజయవంతం చేయవలసినదిగా ఆయన కోరారు.

నేడు మండల స్థాయి ఉల్లాస్ శిక్షణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల స్థాయి ఉల్లాస్ శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి ఉల్లాస్ కార్యక్రమంపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటుల తెలిపారు. శిక్షణా కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు, వెలుగు ఎపిఎం, అంగన్వాడీ కార్యకర్తలు, సంఘమిత్రలు, సిసిలు, విఒఎలు తప్పక హాజరు కావాలని తెలిపారు.

ప్రోటోకాల్ పాటించక పోవడం దారుణం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా పలు గ్రామాలలో సిసి రోడ్లుకు ప్రోటోకాల్ పాటించకుండా భూమిపూజ చేయడం చాలా దారుణమని వీరబల్లి సర్పంచ్ జయరా ణెమ్మ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అభి.వృద్ధి పనులలో గ్రామాలకు సిసి రోడ్ల పనులకు భూమిపూజలో స్థానిక సర్పంచులకు, ఎంపిటిసిలకు, ఎంపిపిలకు తెలుపకుండా అధికార పార్టీ నాయకులు, అధికారులు కలసి పనులు ప్రారంభించడం సరికాదన్నారు. సర్పంచ్‌ల నుంచి ఎటువంటి రెజల్యూషన్ లేకుండా పనులు చేపట్టడం చాలా దారు ణం అన్నారు. మండల కేంద్రంలో గంగమ్మ దేవాలయం నుంచి రైతు భరోసా కేంద్రం వరకు సిసి రోడ్డు జరిగిన భూమిపూజ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్‌కు గానీ, ఎంపిపిగానీ, ఎంపిసిటిలకు గానీ సమాచారం ఇవ్వక పోవడం దారుణమన్నారు. ఈ విషయంపై కలెక్టర్, పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

పాము కాటు.. మహిళ పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పొలం పనులు చేస్తున్న మహిళను పాము కాటేయడంతో పరిస్థితి విషమంగా మారింది. మదనపల్లె మండలం, బొమ్మన చెరువు పంచాయతీ, కోటగుండ్లపల్లికి చెందిన మంగమ్మ వ్యవసాయ పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటేసింది. తీవ్ర అస్వస్థతకు గురైన బాదితురాలిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షిం చిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో ఆస్పత్రిలో చేర్చి చికిత్స అంది స్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు



మృతి చెందిన కృష్ణ జింక

గుర్తుతెలియని వాహనం ఢీకొని కృష్ణ జింక మృతి చెందిన సంఘటన సోమవారం ములకల చెరువులో చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారుల కథల మేరకు వివరాలు.. జింకల మం దులో నుంచి ఓ కృష్ణ జింక తప్పిపోయి ములకలచెరువులోకి వచ్చింద న్నారు. కదిరి రోడ్డులో గుర్తు తెలియనివాహం ఢీకొట్టడంతో కృష్ణ జింక తీవ్రంగా గాయపడి మృతి చెందిందని తెలిపారు. మృతి చెందిన జింకను అటవీ ప్రాంతంలో కననం చేసినట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గోపాల్ తెలిపారు.

వైఎస్ బతికి ఉంటే షర్మిలను విమర్శించేవారా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికి ఉంటే మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి పిసిసి అధ్యక్షులు షర్మిలను విమర్శించే సాహసం చేసేవారా అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో-ఆరినేటర్, కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా సూటిగా ప్రశ్నించారు. తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షర్మిలను విమర్శించేందుకు మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం ఉందా లేకుంటే మీకైమీరు ఇష్టానుసారం మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. అన్నా చెల్లెలు మధ్య ఉన్న వ్యక్తిగత వ్యవహారాల గురించి మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. వ్యక్తిగతంగా విమర్శిస్తే తాము రాజకీయంగా ఎదుర్కొంటామని, రాజకీయంగా 10 ప్రశ్నలు సంధిస్తామని సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని ఇర్ఫాన్‌బాషా పేర్కొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - లింగాల

లింగాల జిల్లా పరిషత్ హైస్కూలులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు భారతి పాలిమర్స్ ప్రయివేట్ లిమిటెడ్ జిఎం వల్లపునేని శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కంటి పరీక్షలు, అవసరమైన వారికి కంటి అద్దాలు, అపరేషన్లు నగదు రహితంగా చేయనునన్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే సిఎం ధ్యేయం : 'చమర్తి'

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తాటిగుంటపల్లి పంచాయతీ, నాయినిపల్లెలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మండల కేంద్రమైన వీరబల్లిలో గంగమ్మగుడి నుంచి బొక్కలగడ్డ వరకు టిడిపి మండల అధ్యక్షులు భానుగోపాల్‌రాజు, నాయకులు సురేంద్రరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డుకు భూమిపూజ చేశారు. అనంతరం పశు వైద్య కార్యాలయానికి వెళ్లి అధికారులను సమస్యల గురించి అడిగారు. ఈ సందర్భంగా పశు వైద్య సిబ్బంది కార్యాలయంలో విద్యుత్ సర్క్యూట్ కావడం వలన విద్యుత్ తీగలు, ఫ్యాన్లు కాలి పోయాయని తెలిపారు. భవనం కూడా శిథిలావస్థకు వచ్చిం దని విధులు నిర్వహించేందుకు భయంగా ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే ప్రభుత్వ పశు వైద్యశాలకు నిర్మాణం కోసం నిధులు తెప్పించి పూర్తి అయ్యేటట్లు చూస్తానని చెప్పారు. అనంతరం తహ శీల్దార్ కార్యాలయానికి వెళ్లి ప్రజల భూ సమస్యల గురించి తహశీల్దార్ శ్రావణిని అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పైన వచ్చిన ప్రజలకు న్యాయం చేయాలని తహశీల్దార్‌ను కోరారు. శ్రీధర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డిలు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. గడికోట పంచాయతీలో సిసి రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు కల్లూరి రామ్మోహన్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ ఇర్ఫాన్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, యువ నాయకులు భాస్కర్‌రాజు, సుధాకర్‌రాజు, ప్రసాద్‌రాజు, పద్మరాజు వెంకట్రామరాజు, నేతి రమేష్, నేతి రామ్మోహన్, దుర్గా ఆంజనేయులు, చలపతి, జనసేన వెంకటేష్, టిడిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు, టిడిపి నాయకులు

మెరుగైన వైద్య సేవలు అందించండి : డిఎంహెచ్‌ఒ



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పట్టణంలోని నారాయణ స్కూల్‌లో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కారణంగా ముందస్తు జాగ్రత్తగా నది పరివాహక ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అవసరమైన వైద్య పరీక్షలను చేసేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన అన్ని వైద్య సేవలను సక్రమంగా అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శేఖర్, డాక్టర్ అయేషా, హెల్త్ సూపర్‌వైజర్ బాలకృష్ణరాజు, పిఎంఒఎ పి.ఓబులేసు, ఎఎన్ఎం సుధామణి పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధి

- కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

విలువ ఆధారిత ఉత్పత్తులతో మెరుగైన ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చునని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. సోమవారం నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రంలో 30 మల్టీ గ్రీన్ ఇన్‌స్టంట్ పౌడర్ తయారీ విధానంపై ఐదు రోజులుగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. చివరిరోజు 30 రకాల ధాన్యాలతో తయారుచేసిన 30 మల్టీ గ్రైన్ ఇన్‌స్టంట్ పౌడర్, పపాయ క్యాండీస్ తయారు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన మహిళలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇందులో భాగంగా కార్యక్రమంలో పాల్గొన్న కలికిరి గ్రామానికి చెందిన మంజుల, అమ్మాజీ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం చాలా ఉపయోగకరంగా ఉందని అన్నారు. ఇక్కడ నేర్పిన కొర్ర, రాగి బిస్కెట్స్, మురుకులు మొదలగు పదార్థాల తయారీ విధానాన్ని ఇంటి దగ్గర చేసి దానిని వ్యాపారంగా మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. వాయల్పాడు మండలానికి చెందిన శశిరేఖ మాట్లాడుతూ ఈ 30 మల్టీ గ్రీన్ ఇన్‌స్టంట్ పౌడర్‌ను జావగాను, దోస పిండిలో కొద్దిగా కలుపుకొని వాడుకుంటామని అన్నారు. మల్టీ గ్రెయిన్ లడ్డు, బజ్జీలు తయారు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, మహిళా పారిశ్రామికవేత్త అలివేలు మంగమ్మ, 40 మంది మహిళలు, కెవికె సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న కెవికె కో-ఆర్డినేటర్ మంజుల

ముందస్తు జాగ్రత్తతో పాడి పరిశ్రమ సంరక్షణ



ప్రజాశక్తి-కలికిరి

ముందస్తు జాగ్రత్తలతో సంరక్షించుకోవచ్చునని పాడిపరిశ్రమ కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. వర్షాల సమయంలో వాతావరణ మార్పుల కారణంగా వాన జల్లులకు తడవడం మూలంగా కలుషితమైన మేత, తాగునీటి వలన పశువులు ఒత్తిడికి గురై రోగనిరోధక శక్తి క్షీణించి వివిధ రోగాల బారిన పడతాయని అన్నారు. పాల ఉత్పత్తి పై ప్రభావం చూపడం వలన పాడి రైతులు నష్టాలకు గురవుతారని అందు వలన ముందస్తు చర్యలు పాటించాలని చెప్పారు. పశువులను ఎత్తయిన సురక్షిత ప్రాంతాలలో ఉంచాలన్నారు. పశువులను బలహీనమైన పాకలు చెట్ల కింద కట్టి వేయరాదని, ఎలక్ట్రిక్ స్తంభాలకు వేలాడే తీగలు ట్రాన్స్ ఫార్మర్ల దగ్గర పశువులను కట్టరాదని అన్నారు. పశువులకు సరిపడేంత గడ్డి దానా అందుబాటులో ఉంచుకోవాలని, గొర్రెలు మేకలను నది పరివాహక ప్రాంతాల్లో కాకుండా సురక్షిత ప్రదేశాల్లో మేపుకోవాలని చెప్పారు. తుఫాను అనంతరం అన్ని పశువులకు నట్టలు నివారణ మందులను తాగించాలని పేర్కొన్నారు. గొంతువాపు వ్యాధి, టీకాలు వేయించాలని, తుఫాను సమయంలో పశు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ఎన్ఆర్ఎల్ఎం కీలకం

- నేషనల్ రిసోర్స్ పర్సన్ నీలెందు ముఖర్జీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మహిళ లక్షాధికారి కావాలనే లక్ష్యానికి ఎన్ఆర్ఎల్ఎం (నేషనల్ రూరల్ లైవ్ లీవ్ మిషన్) సర్వే కీలకం కానుందని నేషనల్ రిసోర్స్ పర్సన్ నీలెందు ముఖర్జీ పేర్కొన్నారు. సోమవారం ఐకెపి కార్యాలయంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఆరు మండలాల ఐకెపి ఎపిఎంలు, సిసిలు, సిఆర్‌పిలు, ఇసి మెంబర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్ఆర్ఎల్ఎం సర్వే పారదర్శకంగా నిర్వహించి భవిష్యత్‌లో మహిళల ఆర్థిక అభివృద్ధికి సహకరించాలని అన్నారు. రిసోర్స్ పర్సన్ ముఖర్జీ సర్వేలో కుటుంబం ఆర్థిక పరిస్థితి, ఆస్తుల వివరాలు, ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, చేతి వృత్తులు, ప్రస్తుత జీవనోపాధి తోబాటు పలు అంశాలపై నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ శిక్షణా ద్వారా మహిళా సంఘాలకు అవగాహన కల్పించి వారి ద్వారా డిపిఆర్ తయారుచేసి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సర్వే నివేదికలు ప్రభుత్వం దృష్టికి పంపడం జరుగుతుందని భవిష్యత్తులో ప్రతి కుటుంబానికి న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సెర్ప్ జూనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ వీరశేఖర్, ఎన్ఐఎస్ ఎంఇ ఫ్యాకల్టీ చిన్నస్వామి, ఎటిఎం గంగాధర్, స్త్రీనిధి మేనేజర్ అమరావతి, మండల సమైక్య అధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, ఆరు మండలాల ఐకెపి ప్రతినిధులు, ఇసి మెంబర్లు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖర్జీ



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్వేయర్లు

బయోమెట్రిక్ నుంచి మినహాయించాలి

ప్రజాశక్తి-పీలేరు

గ్రామ సర్వేయర్లను బయోమెట్రిక్ విధానం నుంచి మినహాయించాలని గ్రామ సర్వేయర్లు తహశీల్దార్ ఎం.భీమేశ్వర రావుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాటా డుతూ గ్రామ సభల్లో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారం, రీసర్వే, హద్దు రాళ్ళపై పేర్లు తొలగింపు వంటి పనులకు తగిన సమయం సరిపో వడం లేదని, పని ఒత్తిడి అధికంగా ఉండడం వల్ల బయోమెట్రిక్ వేయడానికి ఇబ్బందిగా ఉందని అన్నారు. తమ సమస్యలను గుర్తించి తమను బయోమెట్రిక్ నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- లింగాల: రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో బాలయోగి బాలికల పాఠశాల విద్యా ర్థులు ప్రతిభ కనబరిచారు పశ్చిమ గోదావరి జిల్లాలోని పెద్దవేగి అంబేద్కర్ పాఠశాలలో గత నెల 28,29,30 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో లింగాల మండలం ఇప్పట్ల బాలయోగి బాలికల పాఠశాల క్రీడా కారులు ప్రతిభ చూపారు. ఈ నేపథ్యంలో పాఠశాలకు చెందిన ఇంటర్మీ డియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి జ్యోతి డిక్లరేషన్ త్రోలో ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచింది. 7వ తరగతి చదువు తున్న భవ్య 200 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సెక్రటరీ ప్రసన్న వేంకటేసు, జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ, అకాడమీక్ మానటరీ అఫిసర్ సంజీవరావు చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభచూపిన కెజిబివి విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల కెజిబివి పాఠశాలలో 9వతరగతి చదువుతున్న నలుగురు విద్యార్థినులు కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17లో సాఫ్టబాల్ పోటీలో అదరగొట్టారు. గత నెల రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు కాకి నాడలో రాష్ట్రస్థాయి అండర్-17ను నిర్వహించడంతో రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులతో జరిపిన ఆటలు పోటాపోటీగా సాగాయి. ఈ సమ్మిట్‌లో పెద్దపసుపుల కెజిబివి విద్యార్థినులు వెంకట హారిక, నాగ దివ్యశ్రీ, మౌనిక, దీక్షిత సాఫ్ట్ బాల్ పోటీలో గెలుపొంది షీల్డ్ సంపాదించి తృతీయ స్థానంలో నిలిచారు. షీల్డ్ సంపాదించిన విద్యార్థినులను ప్రశంసిస్తూ వారిని అభినందించారు.



బాధితులను పరామర్శిస్తున్న వరలక్ష్మి

తుపాన్ బాధితులకు చేయూత

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఫెంగల్ తుపాన్ ప్రభావంతో ఇల్లు కూలిపోయిన బాధిత కుటుంబానికి అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి రూ.15వేలు ఆర్థిక సాయం చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. గత మూడు రోజులుగా నియోజకవర్గంలో పలుచోట్ల అత్యధికంగా వర్షపాతం నమోదవడంతో సోవ ంవారం ఓబులవారిపల్లి మండలం అయ్యలరాజుపల్లి దళితవాడకు చెందిన దాసరి సుబ్రహ్మణ్యం, గంగ య్య, దాసరి సుబ్బమ్మ, దాసరి లక్ష్మీ నరసమ్మ నివాసాల ఇంటి పై కప్పు కూలిపోయింది. మరి కొందరి గృహాలు వర్షానికి గోడలు తడిచి ప్రమాదకంగా ఉన్నాయి. విషయం తెలుసుకున్న వరలక్ష్మి వెంటనే ఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.బాధితులకు పక్కా గృహాలు మంజూరు చేపించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పల్లా హరి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న భాస్కర్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామాపురం

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పల్లా హరి కుటుంబానికి బిట్స్ కళాశాల కరస్పాండెంట్ మన్నూర్ భాస్కర్ ఆర్థిక సాయం చేశారు. మండలంలోని కుమ్మరిపల్లి పంచాయతీ సురకవాండ్లపల్లికి చెందిన హరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. హరికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుంటే ఆదుకోవాలని ఉద్దేశంతో తనకు తోచిన సాయం చేశానని అన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన భాస్కర్‌ను గ్రామ ప్రజలు అభినందించారు.



అన్నదాన కార్యక్రమంలో దాతలు, లయన్స్‌క్లబ్ సభ్యులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో సోమవారం గాలివీడు మండలం ప్యారం పల్లి పంచాయతీ కరణంవారి కొత్తపల్లికు చెందిన పెద్దిరెడ్డి గంగిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమా రులు పి.నారాయణరెడ్డి, పి.భయ్యారెడ్డి ఆర్థిక సాయంతో ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ తమ తండ్రి వర్ధంతి సందర్భంగా జీవి తంలో చివరి అంకంలో ఉన్న వృద్ధులకు అన్నదానం చేయడం సంతృప్తికరంగా ఉందన్నారు. మా కుటుంబ సభ్యుల పుట్టినరోజులు, వేడుకలకు ప్రజల ఉపయోగపడే పనుచేయడానికి ప్రాధాన్యత ఇస్తామ న్నారు. తమకు సహరించిన లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ షేక్ మహబూబ్‌బాషా, జిల్లా చైర్మన్ హరీష్ చంద్ర, భానుప్రతాప్‌రెడ్డి, ప్రేమాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : దేశంలోని పౌరులందరూ భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని వెల్ఫేర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ సుబహాన్ పేర్కొన్నారు. స్థానిక కెహెచ్ఎం వీధిలోని జమాఅతే ఇస్లామి హింద్ కార్యాలయంలో ఆదివారం పొద్దుపోయాక భారత రాజ్యాంగ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సుబహాన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ పీఠిక అర్థాన్ని వివరించారు. భారతదేశ ప్రజలమైన మనం భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగ నిర్మించుకున్నామన్నారు. పౌరులందరికీ సాంఘిక ఆర్థిక న్యాయాన్ని ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనల స్వాతంత్ర్యాన్ని సాదించుకున్నామన్నారు. రాజ్యాంగ పరిషత్‌లో 1949 నవంబర్ 26న ఎంపిక చేసుకొని శాసనంగా రూపొందిం చుకున్న రాజ్యాంగాన్ని తమకు తాముగా సమర్పించుకుంటున్నామని తెలిపారు. మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం మాట్లాడుతూ భారతదేశం లౌకిక దేశమన్నారు. ఒక మత ఆధారంగా నడవదన్నారు. రాజ్యాంగం ఆధారంగా నడుస్తుందన్నారు. మతం అనేది వ్యక్తిత్వ మన్నారు. దేశంలో జీవించే ప్రతి భారతీయుడికి సమాన హక్కులు కల్పించే గొప్ప దేశం మన భారతదేశం అన్నారు. కార్యక్రమంలో ఎంపిజె జిల్లా అధ్యక్షులు జాకీర్ హుశేన్, పట్టణ అధ్యక్షులు హుశేన్‌బాషా, పాల్గొన్నారు.

పేదలకు సాగు భూమి ఇచ్చే వరకూ పోరాటం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : పేదలకు సాగుభూమి ఇచ్చే వరకు పోరాటం చేస్తామని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సోమవారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య , దళితకుల పోరాట సమితి, దళిత డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలోని 8 మండలాల్లోని సాగుభూమికి అర్హులైన సుమారు దాదాపు 500 మంది ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ సాగు భూమికి అర్హులైన పేదల జాబితా సిద్ధం చేయకపోతే కలెక్టరేట్ ముట్టడి చేస్తామన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో జెసిబి డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు..వాల్మీకిపురం మండలం, బూడిదవేడుకు ఎల్లయ్య కురబలకోట మండలం అంగళ్లులో ఓ వ్యక్తికి జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని తెఇపారు. పనిలో ఉన్న ఎల్లయ్య మధ్యాహ్నం భోజనం తెచ్చు కునేందుకు ద్విచక్రవాహనం లో అంగళ్లుకు బయల్దేరాడని చెప్పారు. మార్గమధ్యంలోకొత్త బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఎల్లయ్యను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడని చెప్పారు. బాధితుడిని స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారని అన్నారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారని తెలిపారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.